క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక


శ్రీచరణ్


అభిషేక్


దిలీప్

యలమంచిలి : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు యలమంచిలి పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వై. శ్రీచరణ్, ఎస్. దిలీప్, వి.అభిషేక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట


పెళ్లి రాట వేస్తున్న భక్తులు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెళ్లిరాట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహితుడు కేటీ దీక్షితులు శాస్త్రోక్తంగా భక్తులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 30న సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు రామాలయ కమిటీ చైర్మన్ దొడ్డ లచ్చుమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, కరణం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఒంపోలులో వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు


ఒంపోలులో వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని ఒంపోలులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఇక్కడి సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరానికి 43 మంది రోగులు హాజరు కాగా వారికి వైద్యాధికారి సంధ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎస్ఎం జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మురుగు నీటితో ఇక్కట్లు


పీఏసీఎస్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రాంబిల్లి: దిమిలిలో పీఏసీఎస్ రోడ్డుపై వర్షం నీరు, మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో స్థానికులే కాకుండా పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు . శ్మశానవాటికకు వెళ్లేందుకు ఈ రోడ్డుపై నుంచే వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డుకిరువైపులా కొంతమంది ఆక్రమణలకు పాల్పడి నీరు పోకుండా నిర్మాణాలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అయినం పరమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ మునగపాకలో అందరి సహకారంతో సంపద తయారీ కేంద్రం ద్వారా ఎరువుల తయారీ జోరుగా సాగుతుందన్నారు. ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమంలో ట్రైనర్ అర్జున్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అవగాహన తప్పనిసరి


పి.ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి సోకిన వారు విధిగా చికిత్స తీసుకోవా లని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రామ్‌నాయక్ అన్నారు. ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. పి.ధర్మవరంలో పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ అఖిలాష్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

పాయకరావుపేట : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యులు బి.విద్యాసాగర్, డాక్టర్ వి.పద్మప్రియ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలో గల 8 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించి, గ్రామస్తులకు తగు సూచనలు, సలహాలు అందించారు. రెండు వారాలు పైబడి దగ్గు వుంటే స్థానిక వైద్యుడిని సంప్రదించాలన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం

రాంబిల్లి: క్షయవ్యాధిని నిర్మూలిద్దామని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసాచార్యులు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా దిమిలిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం, క్షయవ్యాధి ఓడిపోతుంది–దేశం గెలుపొందుతుంది అంటూ విద్యార్థులు, వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు చిట్టిబాబు, ఈశ్వరి, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

చూచుకొండలో..

మునగపాక: మండలంలోని చూచుకొండలో శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వినోద్ మాట్లాడుతూ రెండు వారాల పైబడి దగ్గు ఉంటే టీబీ కావచ్చన్నారు. అలాగే క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయ వ్యాధి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విడనాడండి

యలమంచిలి : ప్లాస్టిక్‌ను విడనాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులో శుక్రవారం చైర్‌పర్సన్ సొంత నిధులతో 620 ఇళ్లకు గుడ్డ సంచులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గుడ్డ సంచులే వాడాలన్నారు. తడిపొడి, ప్రమాదకరమైన చెత్తను వేరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం


కొత్తపోలవరం సీతారామాలయంలో స్వామి అమ్మవారు


సీతారాములను దర్శించుకుంటున్న పలువురు నాయకులతో బొలిశెట్టి గోవిందరావు

ఎస్.రాయవరం: గుడివాడ శివారు కొత్తపోలవరంలో శ్రీ సీతారామాలయం ప్రారంభోత్సవం, సీతారాముల పట్టాభిషేకం, విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. యాగశాల ఏర్పాటు చేసి హోమం నిర్వహించారు. పాలరాతి విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కశింకోటకు చెందిన ప్రముఖ సిద్ధాంతి రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, గుడివాడ, ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, భూపతి అప్పారావు, శానాపతి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమానికి పెద్ద పీట

యలమంచిలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిశు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని యలమంచిలి మండలం జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భవతులకు ప్రభుత్వం అందిస్తున్న చిరుధాన్యాల పోషకహారంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు నియంత్రించాలని, 18 సంవత్సరాలు నిండిన వారికే వివాహాలు చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నగిరెడ్డి అచ్చినాయుడు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సేనాపతి రాము, కె.రవి, వి.బంగారం, సచివాలయ కన్వీనర్లు దిమిలి రమణబాబు, వై.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి : ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని మైహోమ్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్ వీహెచ్ చౌదరి అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో మండలంలో పురుషోత్తపురం, పులపర్తి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి వైద్య నిపుణలు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు, పురుషోత్తపురం, పులపర్తి పాఠశాలలకు ఫస్ట్ ఎయిడెడ్ కిట్లు అందజేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సీనియర్ డీజీఎం ఎల్. శ్రీనివాసరావు, కంపెనీ ప్రతినిధులు, డి.వెంకటరావు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీలు ఏర్పాటు చేయాలి

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు సమర్థులైన విద్యార్థులతో విదార్థి విభాగం మండల కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యకు సూచించినట్లు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులతో తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యావసతి, ఫీజు రియింబర్స్‌మెంట్, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ప్రజలకు తెలియజేసే సత్తా విద్యార్థులకు ఉందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సమర్థులైన విద్యార్థులతో విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేస్తామని హరిబాబు తెలిపారు.


విజయవాడ సమావేశంలో చైతన్యను అభినందిస్తున్న నాయకులు

ఆకట్టుకున్న అంతర్మథనం నాటిక

మునగపాక : మండలంలోని తోటాడ గ్రామంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అంతర్మథనం సాంఘిక నాటిక ఆకట్టుకుంది. తోటాడలోని భావనారుషి కల్యాణంలో భాగంగా ఈ నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. నటీనటులు అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు.

రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు

మునగపాక: మునగపాక నుంచి అనకాపల్లి బైపాస్ వరకు ఉన్న పూడిమడక రోడ్డులో గోతులు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేవారు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు పీఏసీఎస్ ఆవరణలో సమావేశమయ్యారు. గత కొంతకాలంగా రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారని సమస్య పరిష్కారానికి స్పందనలో జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టికి వినతి అందించేందుకు అందరూ సహకరించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సామాజిక కార్యకర్త దాడి శివ, రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

శ్రద్ధగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

నక్కపల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను సామాజిక బాధ్యతగా తీసుకుని కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సూచించారు. శుక్రవారం నక్కపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (శిక్షణ కేంద్రం లో నక్కపల్లి, పాయకరావుపేట, గొలుగొండ, నాతవరం, ఎస్.రాయవరం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. తడిపొడి చెత్తను వేరు చేసి ఘన వ్యర్థాల నుంచి వానపాములను ఉపయోగించి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శిరీష

చెరువులు సుందరీకరించాలి : గ్రామాల్లో చెరువులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సూచించారు. శుక్రవారం ఆమె ఉద్దండపురం పెద్దచెరువును పరిశీలించారు. ఈ చెరువును పాండ్స్ బ్యూటిఫికేషన్ పథకంలో చేర్చి సుందరీకరించాలన్నారు. ప్రతి గ్రామానికి ఒక చెరువును ఎంపిక చేసుకుని అందంగా తీర్చి దిద్దాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. సాయంత్రం సమయంలో కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్ వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా నిధుల జమ

నక్కపల్లి: ఎన్నికల ముందు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు జగనన్న ఇచ్చిన హామీ మేరకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు శనివారం జమ కానున్నాయి. ఈ పథకం ద్వారా పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 62 వేలమందికి రూ.53 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. మండలాల వారీగా పరిశీలిస్తే కోటవురట్ల మండలంలో 1285 సంఘాలకు చెందిన 13491 మంది సభ్యులకు రూ.9.77 కోట్లు, నక్కపల్లి మండలంలో 1611 సంఘాలకు చెందిన 15942 మంది సభ్యులకు రూ.10.46 కోట్లు, పాయకరావుపేట మండలంలో 1831 సంఘాలకు చెందిన 19121 మంది సభ్యులకు రూ.16.38 కోట్లు, ఎస్.రాయవరం మండలంలో 1851 సంఘాలకు చెందిన 18458 మంది సభ్యులకు రూ.16.45 కోట్లు జమ చేయనున్నారు. అలాగే యలమంచిలి నియోజకవర్గంలో అచ్యుతాపురం మండలంలో 1422 సంఘాలకు చెందిన 14401 మంది సభ్యులకు 11.19 కోట్లు, యలమంచిలి మండలంలో 581 సంఘాలకు చెందిన 5825 మంది సభ్యులకు రూ.5 కోట్లు, మునగపాక మండలంలో 1270 సంఘాలకు చెందిన 12716 మంది సభ్యులకు రూ.10.25 కోట్లు, రాంబిల్లి మండలంలో 1155 సంఘాలకు చెందిన 12032 మంది సభ్యులకు రూ. 8.07 కోట్ల లబ్ధి చేకూరుతుందని ఐకేపీ అధికారులు తెలిపారు.

వైఎస్సార్ ఆసరా మహిళలకు వరం

మునగపాక: వైఎస్సార్ ఆసరా మహిళలకు వరం అని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం రాత్రి డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీసీ కళ, సచివాలయ కన్వీనర్ ఆదికుమార్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

మునగపాక: మునగపాక, గణపర్తి తదితర ప్రాంతాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న నువ్వు, పొద్దు తిరుగుడు పంటలను జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు పరిశీలించారు. మండలవ్యాప్తంగా ఎంతమేర పంట దెబ్బతిన్నదనే విషయమై కింది స్థాయి అధికారులు పరిశీలన చేయాలని ఆదేశించారు. పొలాల్లో నీరు లేకుండా చూడాలన్నారు. ముంపునకు గురైన పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, విస్తరణ అధికారి లక్ష్మి, వీఏఏ శ్వేత మీనన్ తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న తోట నగేష్ తదితరులు

పాయకరావుపేట: సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 లక్షల 50 వేలకు పైగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, సేవా కార్యక్రమాలు చేసినందుకుగాను ఆయన భారత ప్రభుత్వంచే పద్మశ్రీ అవార్డు పొందారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకుని స్వస్థలానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో పాయకరావుపేట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గెడ్డం బుజ్జి, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, జి.సత్యనారాయణ, కంభంపాటి వెంకటరమణ, పల్లేల లక్ష్మణ్, ఇంజరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు సత్కారం

నక్కపల్లి: పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్‌ను శుక్రవారం నక్కపల్లిలో స్థానికులు ఘనంగా సత్కరించారు. ఉగాది నాడు రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు తీసుకుని విశాఖ విమానాశ్రయం నుంచి తిరిగి కాకినాడ వెళ్తున్న ఆయనను నక్కపల్లి స్థానికులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించి ఉపమాక వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

కమనీయంగా భద్రావతి సమేత భావనారుషి కల్యాణం


భద్రావతి సమేత భావనా రుషి స్వామి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో శ్రీ భద్రావతి సమేత భావనా రుషి కల్యాణం గురువారం రాత్రి కమనీయంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం కమిటీ చైర్మన్ మాడెం సూరి అప్పారావు, రాష్ట్ర పద్మశాలి సంఘం చైర్మన్ జాగారపు శ్రీనివాసరావు, పప్పు రాజారావు, వెంకటేశ్వరరావు, చిలుకోటి అంజిబాబు, తెడ్లపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు

నక్కపల్లి: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే కాపు విద్యార్థులకు కాపు కార్పొరేషన్ ద్వారా రుణ సాయం అందించనున్నట్లు డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం విజయవాడలో చైర్మన్‌ను కలిసి ఈ ప్రాంత కాపుల ఆర్థిక స్థితి గురించి వివరించినట్లు తెలిపారు. కాపుల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్పొరేషన్ ద్వారా వచ్చే నెల నుంచి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే వారికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అలాగే త్వరలోనే కాపు నేస్తం పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సాయం చేస్తామన్నారు. కాపులకు అందజేస్తున్న లబ్ధి గురించి జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహించి తెలియజేయాలని చైర్మన్ శేషగిరి సూచించారన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో వైస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, ఉపమాక ఎంపీటీసీ సభ్యుడు కొల్నాటి బుజ్జి, ఎన్నేటి రాజు తదితరులు ఉన్నారు.


చైర్మన్‌ను కలసిన కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం తదితరులు

చెరువు అభివృద్ధికి ప్రణాళిక

పాయకరావుపేట : మండలంలో గల సీతారాంపురం గ్రామంలో వున్న చెరువును అభివృద్ధి చేస్తామని, అందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. అనంతరం మంగవరం, నామవరం, పాల్మన్‌పేట గ్రామ పంచాయతీలను పరిశీలించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్నట్లు మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావలిసిందిగా కోరారు.

మంగవరంలో సప్తాహం

పాయకరావుపేట : మండలంలో గల మంగవరం గ్రామంలో సప్తాహం నిర్వహిస్తున్నారు. రామాలయం వద్ద జరిగే సప్తాహం వారం రోజుల పాటు కొనసాగుతుంది. ఉగాది నుండి ప్రారంభమైన సప్తాహం రాత్రీపగలు కూడా నిర్వహిస్తారు. శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సప్తాహంలో చుట్టుపక్కల భజన బృందాలు పాల్గొంటున్నాయని సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు

మునగపాక: పంట పొలాలకు ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు బయటికి పోయే మార్గం లేకపోవడంతో ఆయన శుక్రవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. పొలాలకు ఆనుకుని ఉన్న కాలువలను శుభ్రం చేయించి నిలిచిపోయిన నీటిని బయటికి పంపేలా ఏర్పాట్లు చేశారు.